# అందం - ఆదర్శం

ఆంధ్రభూమి వీక్లీ.. 3 అక్టోబర్, 2002




సతీష్ చెన్నై నుంచి హౌరా వెళ్లే ట్రైను కోసం ఎదురుచూస్తున్నాడు.

అతని తల్లి చెన్నైలో పెద్దకొడుకు దగ్గర కొద్దిరోజులుండి వస్తోంది.

హైదరాబాదు నుంచి చెన్నై వెళ్లే ట్రైను సతీష్ ఎదురుగా ఉన్న ప్లాట్‌ఫారం పైన ఆగింది. పేపరు మూసేసి, ట్రైను నుంచి దిగేవాళ్ళను, ట్రైనులో ఉండేవాళ్ళను కుతూహలంగా చూడసాగాడు.

అతని దృష్టి ఎదురుగా ఉన్న కంపార్ట్‌మెంట్‌లోని అమ్మాయిపై పడింది.

అందం, అమాయకత్వం కలబోసి సృష్టించిన బంగారుబొమ్మలా వుంది ఆమె. ఆ అమ్మాయి మీది నుండి తన దృష్టి తిప్పుకోలేకపోయాడు.

ఆమె కూడా సతీష్‌ని చూసింది.

అతను తననే చూస్తుండటంతో ముందు ఆశ్చర్యంగా చూసి, తరువాత తల త్రిప్పుకుంది.

సతీష్‌కి ఆమె ఎంతో నచ్చింది. అతనికోసం తల్లి ఎన్నో సంబంధాలు చూస్తున్నా- అతనికి ఎవరూ నచ్చడం లేదు. తనకు నచ్చిన ఈ అమ్మాయి ఎవరో తెలుసుకొని, అన్నీ కుదిరితే పెళ్ళి చేసుకోవాలని అనుకొన్నాడు.

ఆమె ఎవరో, ఎక్కడుంటుందో తెలుసుకోవాలంటే తను కూడా ఆ ట్రైనులోనే ప్రయాణించి, వీలైతే ఆమెతో మాట్లాడి, లేకుంటే కనీసం ఫాలో చేసి ఆమె ఇల్లు కనుక్కోగలిగితే... తర్వాత మిగతా పనులు సులభం అవుతాయి.

చూస్తే ఆమె చెన్నైకే వెళుతున్నట్టుంది! తనూ ట్రైను ఎక్కేసేవాడే! తల్లి మరో ట్రైనులో వస్తోంది. పైగా... ఇంటి కీస్ తన దగ్గరే వున్నాయి.

అతడు చురుగ్గా ఆలోచించసాగాడు. వెంటనే ఒక ఉపాయం స్ఫురించింది. తన జేబులోని సెల్ తీసి తన మిత్రుడు గణేష్ నెంబరు డయల్ చేయసాగాడు. గణేష్- సతీష్‌తో పాటే వరంగల్‌లో బి.టెక్. చదివాడు. ప్రస్తుతం ఉద్యోగరీత్యా చెన్నైలో ఉంటున్నాడు.

"హలో గణేష్..! నేను సతీష్‌ని!"

"హలో సతీష్..! హౌ ఆర్ యు? ఏమిటీ... ఈరోజు నా మీద ఇంత దయ కలిగింది?"

"నీ దయ కోసమే..."

"చెప్పు! ఏం చేయమంటావు?"

"మీ ఇల్లు సెంట్రల్ రైల్వే స్టేషన్‌కి దగ్గరగా ఉందా?"

"దూరమే! కానీ, ప్రస్తుతానికి నేను స్టేషన్‌లోనే ఉన్నాను. మా పెదనాన్న ఫ్యామిలీతో హైదరాబాదు నుంచి వస్తున్నారు. వాళ్ళను రిసీవ్ చేసుకోవడానికి వచ్చాను. ట్రైను రెండుగంటలు లేటట! మళ్లీ ఇంటికి వెళ్లడం ఎందుకని ఇక్కడే కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాను."

"అబ్బ... ఎంత అదృష్టం గణేష్?! నువ్వు ఎదురుచూసే ట్రైను ఇంకా ఇక్కడే, నెల్లూరులోనే ఆగి ఉంది. అందులో ఎస్.ఫైవ్ కోచ్‌లో మెరూన్ రంగు చీరలో ఓ అందాలబొమ్మ ఉంది. చూడగానే నాకు ఎంతో నచ్చింది. ఆ అమ్మాయి ఎవరో, ఎక్కడుందో నువ్వు తెలుసుకోవాలి. నా కోసం శ్రమ తీసుకోక తప్పదు."

"తప్పకుండా..! నాతోపాటు మా చెల్లెలు దివ్య కూడా వచ్చింది. మావాళ్ళను ఆమెతో ఆటోలో పంపి, నేను ఆ అమ్మాయిని ఫాలో అవుతాను. ఐవిల్ కాల్ యూ బేక్!"

"థాంక్యూ..." అంటూ సెల్ ఆఫ్ చేశాడు సతీష్.

ఇంతలో... ట్రైను కదులుతూంటే అప్రయత్నంగా లేచి ట్రైనుతోపాటే మెల్లగా అడుగులు వేయసాగాడు. ఆమె కనుమరుగయ్యాక మళ్లీ వచ్చి బెంచీపై కూర్చున్నాడు.

మధ్యాహ్నం రెండు గంటలకు గణేష్ నుంచి ఫోన్ వచ్చింది!

"ఐ యామ్ సారీ సతీష్! ఆ అమ్మాయి ఎంత అందంగా ఉందో- అంత అందమైన కూతురుంది ఆమెకి!"

"అయ్యో..." అని బాధపడి, వెంటనే తేరుకొని-

"ఇట్సాల్ రైట్. థాంక్యూ గణేష్! నిన్ను ఇబ్బంది పెట్టాను..." అన్నాడు.

"ఫర్వాలేదు. యు ఆర్ వెల్ కమ్! బహుశా... నీకోసం భగవంతుడు ఇంకో అందమైన అమ్మాయిని సిద్ధంగా ఉంచాడేమో... ఉంటాను!"

• • •

ఫోన్ మ్రోగుతూంటే రిసీవర్ తీసింది ఇందిర.

"హలో... అక్కా! నేను సతీష్‌ని!"

"చెప్పరా... ఎప్పుడొస్తున్నావు హైదరాబాదు?"

"ఆ విషయం చెప్పడానికే ఫోన్ చేస్తున్నాను!"

"త్వరగా చెప్పు? ఎప్పుడొస్తావో ముందే చెప్తే మేము పారిపోవచ్చు!"

"నువ్వు అలా చేస్తావనే నీకు చెప్పకుండా హైదరాబాదు వచ్చేశాను."

"అలాగా..? స్టేషన్ నుంచి చేస్తున్నావా ఫోను? అయినా ఇంకా అరగంట టైముంది నాకు పారిపోవడానికి!"

"ఒక్క సెకను కూడా నీకు టైము లేదు."

"ఎలా?" అంటూ ఎదురుగా తమ్ముడిని చూసి ఆశ్చర్యపోయింది.

చేతిలో 'సెల్'తో నిలబడి ఉన్నాడు సతీష్.

"ఇంజనీరువైనా ఇంకా నీకు హైస్కూలు కుర్రాడి బుద్ధులు పోలేదు."

"నీకు మల్లే..!"

ఇందిర భర్త శ్రీధర్, కొడుకు చైతన్య సతీష్‌ని పలకరించారు.

"ఏరా చైతూ..! పరీక్షలు బాగా రాశావా?"

"రాశాను మామయ్యా! వచ్చే నెల ఎంట్రన్సుకి ప్రిపేర్ అవుతున్నాను!"

"వెరీగుడ్... ఐ విష్ యూ ఆల్ ద బెస్ట్!" అన్నాడు సతీష్.

"నీ ఉద్యోగం ఎలా వుంది సతీష్..?" భోజనాల దగ్గర శ్రీధర్ అడిగాడు.

"ఆ ఉద్యోగం వదిలేశాను బావా! ఇక్కడే మంచి కంపెనీలో ఉద్యోగం దొరికింది. రేపే జాయిన్ కావాలి!" చెప్పాడు సతీష్.

సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటున్న అమ్మాయిని చూసి బిగ్గరగా అక్కని పిలిచాడు సతీష్.

"ఏమైందిరా..?" గాభరాగా అడిగింది ఇందిర.

"నీకు కూతురు పుడితే కనీసం సొంత తమ్ముడికైనా చెప్పాలనిపించలేదా..?" బాధ నటిస్తూ అన్నాడు.

"నీ మొఖంc... ఆ అమ్మాయి మన ఇంట్లో అద్దెకి ఉన్నవాళ్ళ అమ్మాయి!"

"అలాగా! ఎంత బాగుందక్కా పాప?! ఎక్కడో చూసినట్లే అనిపిస్తోంది నాకు!"

"వాళ్ళ అమ్మను చూశావంటే కళ్ళు తిరిగి పడిపోతావు. అంత బాగుంటుంది ఆమె!"

"కళ్ళు తిరిగేలా చేసే 'అమ్మాయిల్ని' చూపించమంటే– 'అమ్మల్ని' చూపిస్తానంటున్నావు నువ్వు!"

"చూపిస్తాను కాని, నీకు ఎలాంటి అమ్మాయి కావాలో చెప్పు!"

"ఈ ప్రశ్న నువ్వు అడగడం నూట ముప్పై తొమ్మిదోసారి అనుకుంటాను!"

"నువ్వు జవాబు చెప్పడం మాత్రం ఇదే మొదటిసారి అవుతుంది... చెప్పు!"

"అక్కా..! తల్లిదండ్రుల్నీ, తోబుట్టువుల్నీ ఎన్నిక చేసుకునే అవకాశం ఇవ్వలేదు ఆ భగవంతుడు. ఒక్క జీవిత భాగస్వామిని ఎన్నిక చేసుకునే అవకాశం మాత్రమే ఇచ్చాడు. నేను ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నాను. అందం, మంచి నడవడిక ఉన్న అమ్మాయి భార్యగా కావాలి నాకు."

"ఇక ఆ విషయం నాకొదిలెయ్ః... నేను చూసుకుంటాను!" అభయమిచ్చింది ఇందిర.

• • •

ఒకరోజు సాయంత్రం ఫోన్ రింగయితే తీశాడు సతీష్.

"అక్కా..! వరంగల్ నుంచి సురేంద్ర అట! శ్రావణిని పిలవమంటున్నారు. అయిదు నిమిషాల తర్వాత మళ్లీ చేస్తారని చెప్పారు."

"శ్రావణి అంటే ప్రతిమ అమ్మ! కాస్త వెళ్లి ఫోన్ వచ్చిందని చెప్పు!" గ్రైండర్‌లో పిండి తీస్తూ అంది ఇందిర.

కాలింగ్ బెల్ నొక్కగానే- తలుపు తీసిన స్త్రీని చూసి సతీష్ ఆశ్చర్యపోయాడు.

ఆమె తను నెల్లూరు రైల్వేస్టేషనులో చూసిన అమ్మాయి!

"వరంగల్ నుంచి ఫోను... శ్రావణి కావాలట!"

"నాన్నా! ఆయన దగ్గర్నుంచి ఫోను!" అంటూ గట్టిగా అరచి పరిగెత్తినట్లే క్రిందికి వెళ్లింది.

భర్త నుంచి ఫోన్ అనగానే కనిపించవలసిన ఆనందం బదులు- భయం, కంగారు ఆమెలో కనిపించడం అతన్ని ఆశ్చర్యపరచింది.

తనూ క్రిందకి వచ్చి, "కూర్చోండి... మళ్లీ చేస్తానన్నారు!" అని బయటకు వచ్చి నిల్చున్నాడు. ఆమెను మళ్లీ చూడటం ఎగ్జైయిటింగ్‌గా ఉందతనికి.

ఇంతలో... ఫోను మ్రోగడం, ఆమె మాట్లాడటం, ఏడవటం వినిపిస్తోంది. ఆమె తండ్రి కూడా ఏడుస్తూ మాట్లాడుతున్నాడు.

'ఆ సురేంద్రకి ఏమైందో...' అనుకుంటూ లోపలికి వచ్చాడు.

వాళ్ళ మాటలు విన్నాక అతనికి అర్థమైంది- సురేంద్రకి ఏదో జరిగి వీళ్ళు ఏడవడం లేదనీ, అతనే వీళ్ళను ఏడిపిస్తున్నాడనీ!

నేరుగా తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. పుస్తకం చేతిలోకి తీసుకొని చదువుకోసాగాడు.

అయిదు నిమిషాల తర్వాత అన్న కూతురు 'చిత్ర' పుట్టినరోజని గుర్తొచ్చి, గదిలో ఉన్న కార్డ్‌లెస్ ఫోన్ తీశాడు. అందులో మాటలు వినిపిస్తే అప్పుడు గుర్తొచ్చింది- శ్రావణి ఫోనులో భర్తతో మాట్లాడుతోందని! ఫోన్ పెట్టబోతూ... సురేంద్ర మాటలు వినిపించి ఆగాడు-

"నీకు వాతలు పెట్టి చాలా రోజులయింది. ఇక్కడికి రా... చెబుతాను. నా బెల్టు కూడా నీ మీద బెంగపెట్టుకొంది!"

"వద్దండీ... ప్లీజ్! మీరేం చేయమంటే అది చేస్తాను. దయచేసి నన్నిక కొట్టడం ఆపేయండి!"

"పుట్టింట్లో మెక్కిమెక్కి బాగా లావయివుంటావు. తగ్గాలంటే వెయిట్ రిడక్షన్ ట్రీట్‌మెంట్ తీసుకోవాలిగా! అవునూ... ఇందాక ఫోన్ తీశాడే... ఎవరతను? మీ ఇంటి ఓనర్ గొంతులా లేదే?"

"ఆయన బావమరిది... ఇందిర వదిన తమ్ముడు!"

"ఓహో... అయితే తమరు బిజీ అన్నమాట! మాటలు కలపడం, చూపులు విసరడం అన్నీ ఈపాటికే అయిపోయి వుంటాయి. ఇక, కాగల కార్యం గంధర్వుడే చేస్తాడన్నమాట!"

"వద్దండీ... అలా మాట్లాడకండి! ఇంతకంటే ఆ బెల్టుదెబ్బలే నయం! మీ మాటలతో నన్ను హింసించకండి ప్లీజ్!"

ఇక వినలేక ఫోన్ పెట్టేశాడు.

ఆరాత్రి భోజనాల దగ్గర తమ్ముడు డల్‌గా ఉండటం చూసి-

"ఒరేయ్... ఎందుకురా బాధపడతావు? ఆ సన్నివేశం నీకు క్రొత్తగాని, మాకు దాదాపు ప్రతివారం ఉన్న తంతే! అంత అందమయిన అమ్మాయిని మరెవడైనా అయితే కళ్ళలో పెట్టుకొని చూసుకునేవాడు. ఆమె దురదృష్టంకొద్దీ ఈ రాక్షసుడికి ఇల్లాలైంది!" అంది ఇందిర.

"అక్కా..! వాళ్ళ బాధ చూస్తుంటే నాకు మనసంతా కలచివేసినట్లుంది. భగవంతుడు పెట్టే కష్టాలకు తోడు మనుషులు కూడా ఇలా కష్టపెడితే... పాపం- వాళ్ళెలా బ్రతికేది?"

సతీష్ కంట్లో నీరు తిరగడం చూసి-

"నువ్వు చాలా సెన్సిటివ్‌రా... ఎవరైనా బాధపడితే చూడలేవు నువ్వు!" అంది ప్రేమగా తమ్ముడినే చూస్తూ.

ఆరాత్రంతా నిద్రపట్టలేదు సతీష్‌కి. ఏడుస్తున్న శ్రావణి రూపమే అతని కళ్ళలో మెదలసాగింది. వేకువ ఝామున నాలుగింటికి నిద్ర పట్టింది.

గేటు దగ్గర శబ్దమవుతూంటే లేచి టైము చూశాడు. నాలుగున్నర అయింది!

బయటకు వచ్చి, "ఎవరు?" అన్నాడు.

"సుబ్బారావు అల్లుడ్ని!" అతడే 'సురేంద్ర' అని అర్థంచేసుకున్నాడు సతీష్.

ఒక్కక్షణం బావని లేపి గేటు తియ్యమని చెప్పాలనుకున్నాడు. సురేంద్ర ముఖం కూడా చూడటం ఇష్టం లేదు అతనికి. మళ్లీ ఆయన్ని డిస్టర్బ్ చేయడం ఎందుకని- తనే గేటు తాళం తీస్తూ అతన్ని చూశాడు. అందంగానే ఉన్నాడతను.

అతడు ఇంట్లోకి వెళ్లాక, మళ్లీ వచ్చి పడుకున్నాడు. అయితే... అతనికి నిద్ర పట్టలేదు.

అరగంట తర్వాత ఆ ఇంట్లోంచి అరుపులు, ఏడుపులు వినిపించసాగాయి. శ్రావణిని అతడు కొడుతున్న శబ్దం వినిపించసాగింది.

గబగబా ఇందిరను లేపి, "అక్కా..! వాడు ఆ అమ్మాయిని చంపేస్తున్నాడే! నీవు వెళ్లి ఆపవే..!" అన్నాడు.

"వద్దురా... వాళ్ళ కుటుంబ వ్యవహారాల్లో మనం జోక్యం చేసుకోకూడదు!" అందామె.

ఆమెకీ శ్రావణిని చూస్తుంటే ఎంతో బాధ కలుగుతోంది. 'సాయినాథా! ఆ అమ్మాయికి సుఖాన్నీ, మనశ్శాంతినీ ఇవ్వు తండ్రీ!" షిరిడీ సాయి పటాన్నే చూస్తూ కోరుకుంది ఇందిర.

• • •

ఆ తర్వాత వారంరోజుల్లో సతీష్‌ని అమెరికా పంపింది... అతని కంపెనీ!

వీసా, టికెట్టు కంపెనీవాళ్ళే అరేంజ్ చేసి, వెంటనే బయలుదేరమనడంతో- హడావుడిగా అమెరికా వెళ్లిపోయాడు. జీవితంలో ఒకసారైనా విదేశాలకు వెళ్లిరావడం అతనికున్న కోరికల్లో ఒకటి! అది తీరుతున్నందుకు సంతోషంతో వెళ్లాడు.

సంవత్సరం తరువాత మళ్లీ ఇండియాకొచ్చాడు. ఇందిర భర్తతోపాటు ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లి తమ్ముణ్ణి రిసీవ్ చేసుకుంది.

ఇంటికి రాగానే ఎదురైన ప్రతిమను ఎత్తుకుంటూ- "అక్కా..! వీళ్ళు ఇంకా ఇక్కడే వున్నారా?" అన్నాడు ఇందిరతో.

"ఇకపై ఇక్కడే వుంటారు!"

అర్థంకానట్లు చూశాడు.

"తర్వాత చెప్తాలే కాని, ముందు నువ్వు స్నానం చేసిరా... టిఫిన్ రెడీగా వుంది!" అంది ఇందిర.

టిఫిన్ తింటూ శ్రావణి విషయం మళ్లీ అడిగాడు-

"ఆ తండ్రీకూతుళ్ళను ఒప్పించి శ్రావణి భర్తకు విడాకుల నోటీసు ఇప్పించాం నేనూ, మీ బావగారు. కోర్టులో కేసు నడుస్తోంది. త్వరలోనే విడాకులు మంజూరైపోతాయి. ఆ అమ్మాయికి మనశ్శాంతి లభిస్తుంది!"

"మరి, తండ్రి తర్వాత శ్రావణిని ఎవరు చూసుకుంటారు? పాపం... ఆమెకి జాబ్ కూడా లేదు కదా!"

"ఆ సందేహం వాళ్ళకొచ్చిందా వచ్చింది. మేమే ధైర్యం చెప్పాము. ఆ అమ్మాయి డిగ్రీ పాసైంది. మీ బావగారే వాళ్ళ ఆఫీసులో ఉద్యోగం ఇప్పించారు. ప్రస్తుతానికి మనింట్లోనే కంప్యూటర్‌లో ఇన్ఫర్మేషన్ ఫీడ్ చేసే పని ఇచ్చారు. కోర్టులో కేసు పూర్తయ్యాక, ఆమె కొంత కోలుకున్నాక ఆఫీసుకి రావచ్చని చెప్పారు!"

"మంచిపని చేశారు. ఆటువంటి దుర్మార్గుడితో జీవితం పంచుకోవడం కంటే విడిపోయి జీవించడమే మేలు!" అన్నాడు సతీష్.

ఆ సాయంత్రం టీ.వీ. చూస్తున్న సతీష్- శ్రావణి రావడంతో లేచి, "రండి..!" అన్నాడు.

ఆమె పలకరింపుగా నవ్వి, కంప్యూటర్ ముందు కూర్చుని పని చేసుకోసాగింది.

ఆమెని చూస్తే జాలేసింది సతీష్‌కి. ముందు ఓ సౌందర్యరాశిగా కనిపించి తన మనసులో స్పందన కలిగించింది. తర్వాత ఓ శాడిస్టుకు భార్యగా పరిచయం అయింది. ఇప్పుడు విడాకులు పొందబోయే స్త్రీగా కనిపిస్తోంది. 'ఆమెకి విడాకులు మంజూరయ్యాక తను పెళ్ళి చేసుకుంటే..?' అనుకున్నాడు. మళ్లీ అంతలోనే 'అమ్మో... ఆ సంగతి చెప్తే అక్క, అమ్మ ఇద్దరూ చీవాట్లు వేస్తారు. అన్నయ్య సీరియస్‌గా చూస్తాడు. 'ప్రపంచంలో ఇంకే అమ్మాయీ నీకు దొరకలేదా?' అని వదిన క్లాసు తీసుకుంటుంది. కాబట్టి ఆ ఆలోచన మానుకుంటే మంచిది' అనుకొన్నాడు.

రాత్రి భోజనాలప్పుడు శ్రావణి ప్రస్తావన వచ్చింది.

"శ్రావణి చాలా సిన్సియర్‌గా పనిచేస్తోంది. కొంతమంది కష్టాలు వస్తే కృంగిపోయి కర్తవ్యం మరచిపోతారు. శ్రావణి అలాకాదు. జరిగిపోయినదానికన్నా జరగబోయేదాని గురించే ఆలోచిస్తుంది.

పైగా- మనలాంటి శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహాల్లో మంచి ఉంటే పాటిస్తుంది. ఇప్పుడు ఆమె ఉన్న పరిస్థితుల్లో మెడిటేషన్ చేస్తే మంచిదని సలహా ఇచ్చాను. తను రోజూ మెడిటేషన్ చేస్తుంది. అలా మనం చెప్పే మంచి వినేవాళ్ళ కోసం ఎంతైనా చెయ్యాలనిపిస్తుంది."

"విడాకులు మంజూరయ్యాక ఓ మంచివ్యక్తిని చూసి పెళ్ళి కూడా చేసేద్దామండి!" అంది ఇందిర.

"అదంత సులభం అనుకుంటున్నావా అక్కా! తెలిసి తెలిసి ఓ డైవోర్సీని పెళ్ళిచేసుకోవడానికి ఎవరు ముందుకొస్తారు? పైగా- ఒకసారి జీవితంలో దెబ్బతిన్నది కనుక ఈసారి మాత్రం 'మంచివ్యక్తి' అని కన్ఫర్మ్ చేసుకున్నాకే పెళ్ళి చెయ్యండి."

"ఆ విషయం మాకు తెలియదా సతీష్..! మాకు బాగా తెలిసిన అబ్బాయినే ఇచ్చి చేస్తాము. ఆదర్శవంతులు ఇంకా ఉండే ఉంటారు!" అన్నాడు శ్రీధర్.

"ఎవరి విషయమో ఎందుకు? నువ్వే చేసుకోరాదా శ్రావణిని?" అంది ఇందిర.

"నేనా?" ఆశ్చర్యంగా చూశాడు సతీష్.

"అమ్మా, అన్నయ్య ఒప్పుకోరు!" అన్నాడు మళ్లీ తనే.

"ముందు నీ సంగతి చెప్పు! నువ్వు ఒప్పుకుంటావా?"

"అక్కా..! మనం సమాజంలో బ్రతుకుతున్నాం. మన బంధువుల సర్కిల్, ఫ్రెండ్స్ సర్కిల్ పెద్దది. వాళ్ళు ఏమనుకుంటారో అన్నది కూడా ఆలోచించాలి!"

"ఒరేయ్ః... నువ్వు చిన్నవాడివి! ఒక మంచి చేస్తే, అదీ అందరూ చేయలేని పనిచేస్తే, ఎంతమంది సంతోషపడతారో, నువ్వు ఎంతమందికి మార్గదర్శకుడివి అవుతావో నీకర్థం కావడం లేదు."

"సతీష్! మేము యువకులుగా ఉండేరోజుల్లో సినిమాలు చూసినా, నవలలు చదివినా ఒకరకమైన ఆవేశం కలిగేది మాకు... ఒక విధవను కాని, డైవోర్సీని కాని, అనాథనుగాని పెళ్ళి చేసుకొని, వాళ్ళకు జీవితాన్నిచ్చి గొప్పపని చేశామన్న సంతోషం పొందాలని! అలా ఏవేవో అనుకునేవాళ్ళం. అయితే మా పెద్దవాళ్ళ సహకారం మాకుండేది కాదు. ఇప్పుడు మేము సపోర్ట్ ఇచ్చినా అలాంటి పనులు చేయడానికి మీకు మనసు లేదు. ప్రతి యువకుడూ 'బాగా చదువుకోవాలి, విదేశాలకి వెళ్లి లక్షలు సంపాదించాలి. డబ్బు, అందం, ఉద్యోగం ఉన్న అమ్మాయి భార్యగా రావాలి' ఇలాంటి ఆలోచనలే తప్ప- ఆశయాలకు మీ మదిలో చోటు లేదు. ఐ పిటీ యు!" అన్నాడు శ్రీధర్.

"బావా... నాకు రెండురోజులు గడువివ్వండి... నా నిర్ణయం చెబుతాను!"

"రెండురోజులు కాకుండా రెండు నెలలు తీసుకో. తొందరేం లేదు!" అంది ఇందిర సంతోషంగా.

"అక్కర్లేదు. రెండురోజులు చాలు!"

కొద్దిరోజుల తర్వాత గణేష్‌కి ఫోన్ చేశాడు సతీష్.

"హలో గణేష్ హియర్..."

"గణేష్! సతీష్‌ని మాట్లాడుతున్నాను. ఆరోజు స్టేషన్‌లో ఓ అమ్మాయి వివరాలు కనుక్కోమన్నాను. గుర్తుందా... ఆ అమ్మాయిని నేను పెళ్ళి చేసుకోబోతున్నాను!"

"అవును. శ్రావణి చెప్పింది. అయితే ఆ మనుషుల్లో దేవుడు నీవని నాకు తెలియదు."

"శ్రావణి నీకు తెలుసా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మా పెదనాన్న కూతురే శ్రావణి! వాళ్ళను రిసీవ్ చేసుకోవటానికే ఆరోజు నేను స్టేషన్‌కి వెళ్లింది. నువ్వు చెప్పిన కోచ్‌లో మెరూన్‌రంగు చీరలో వున్న శ్రావణిని చూడగానే నాకు చాలా బాధవేసింది- నిన్ను డిసప్పాయింట్ చేస్తున్నందుకు, నీలాంటి వ్యక్తి శ్రావణికి ముందే తారసపడనందుకు! నౌ అయామ్ హేపీ! మా శ్రావణి జీవితంలో ఇకనైనా వసంతం వస్తుందనుకుంటున్నాను."

"తప్పకుండా! ఆమెకు గతం గుర్తుకురాకుండా, వర్తమానంలో వ్యథలు లేకుండా, భవిష్యత్తు గురించి భయం లేకుండా చూసుకుంటాను. ఇటీజ్ మై ప్రామిస్!" అన్నాడు సతీష్.